నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- కొడంగల్‌లోని కస్తూర్బా గాంధీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

పాఠశాలకు సరఫరా అయిన బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, జనవరి 30 : ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని తప్పకుండా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల, కశాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే వంట సరుకులు, కూరగాయలు, బియ్యాన్ని పరిశీలించారు. పాఠశాల తరగతి గదులు, పరిసర ప్రాంతాలతో పాటు మరుగుదొడ్లను తనిఖీ చేసి ఎస్‌వో స్రవంతిని లభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సరఫరా చేసే బియ్యం నాసిరకంగా ఉంటే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే వాటిని మార్చుకోవాలని, ఎటువంటి ఇబ్బంది లేకుండా వంట చేయాలని సూచించారు. కూరగాయలను పూర్తిగా చెక్ చేసుకోవాలని, వండేటప్పుడు వాటిని శుభ్రం చేసి వాడుకోవాలని తెలిపారు. వంట వండే సిబ్బందితో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యాబోధన చేపట్టాలని, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు అన్నింటా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి బోధనతో పాటు సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, కస్తూర్బా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కందులను పరిశీలిస్తున్న నాఫెడ్ అడిషనల్ ఎండీ సునీల్‌కుమార్ సింగ్

దళారీ వ్యవస్థ నిర్మూలనకు కేంద్ర సర్కార్ కృషి

నాఫెడ్ అడిషనల్ ఎండీ సునీల్‌కుమార్ సింగ్

తాండూరు, జనవరి 30 : దళారీ వ్యవస్థ నిర్మూలకు కేంద్ర సర్కార్ కట్టుబడి ఉందని నాఫెడ్ అడిషనల్ ఎండీ సునీల్‌కుమార్ సింగ్ తెలిపారు. గురువారం తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డును సునీల్‌కుమార్ సింగ్ తాండూరు మార్కెట్ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి అక్కడి విషయాలను తెలుసుకున్నారు. కందుల నాణ్యత, తూకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పంటకు సరైన మద్దతు ధర కల్పిస్తుందన్నారు. ఐదు రకాల పప్పు దినుసుల పంటల ఉత్పత్తి కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందన్నారు. దేశంలో 36 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంటే.. అందులో 12 లక్షల మెట్రిక్ టన్నుల కంది పంట కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా ప్రాంతం నుంచే ఉత్పత్తి అవుతున్నదన్నారు. కర్ణాటకలో అత్యధికంగా కంది పంట సాగు ఉండడంతో అక్కడి రైతులకు బోనస్ అందించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో నాఫెడ్ అధికారి హుస్సేన్, మార్క్‌ఫెడ్ అధికారి వెంకట్, స్థానిక అధికారులున్నారు.

రేపు దాస్యానాయక్‌తండాకు కేటీఆర్ రాక

- దాస్యానాయక్‌తండాలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేయనున్న కేటీఆర్
- భారీ బహిరంగ సభ నిర్వహణకు స్థలాన్ని పరిశీలించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

దాస్యానాయక్‌తండాలో బీఆర్ఎస్ బహిరంగ సభను నిర్వహించేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

కులకచర్ల, జనవరి 30 : ఫిబ్రవరి 1న కులకచర్ల మండల పరిధిలోని దాస్యానాయక్‌తండాలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు హాజరవుతారని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం కులకచర్ల మండల పరిధిలోని దాస్యానాయక్‌తండాలో విగ్రహావిష్కరణ, బహిరంగ సభ గోడపత్రికను సేవాలాల్ సేన నాయకులు, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ విగ్రహాన్ని సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఆవిష్కరించేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 11.30 గంటలకు విగ్రహావిష్కరణ అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించనున్నారని పేర్కొన్నారు.

గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ కృషిచేసిందన్నారు. నాడు రైతు బంధుతో ఆనందంలో ఉన్న రైతన్న.. నేడు రైతు బంధు రాక అప్పులపాలయ్యారని ఆరోపించారు. రైతు బంధు, రైతు రుణమాఫీని సక్రమంగా అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని తెలిపారు.

తండాలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు, బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. తండాల్లో కూడా అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పాలనే ఉద్దేశంతో సేవాలాల్ సేన నాయకులు కృషిచేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సేవాలాల్ సేన నాయకులు, సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, నర్సింహ, మేఘ్యానాయక్, కృష్ణయ్యగౌడ్, నర్సింహులు, సేవాలాల్ సేన నాయకులు అజయ్‌నాయక్, రాజూనాయక్, పరిగి ఆంజనేయులు ముదిరాజ్, దాస్యానాయక్‌తండా మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సేవాలాల్ సేనా సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- హామీలు నెరవేర్చేవరకు బీఆర్ఎస్ ఉద్యమిస్తూనే ఉంటుంది
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- శేరిగూడలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం, సాగర్ రహదారిపై ర్యాలీ

సాగర్ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

రంగారెడ్డి, జనవరి 30 (నమస్తే తెలంగాణ)/ఇబ్రహీంపట్నంరూరల్ : ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయటంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోవడంతో రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడలో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదిహేను రోజులుగా 4 గ్యారంటీల అమలు పేరుతో హడావుడి సృష్టించిందని, కాని, పథకాలు అందించంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలను అమలు చేస్తామని గ్రామాలు, వార్డుల్లో పెద్ద ఎత్తున గ్రామసభలు నిర్వహించిందన్నారు. గ్రామసభల్లో ఏ ఒక్కరికీ న్యాయం చేయలేకపోయిందన్నారు. మండలానికో గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసి ఆ గ్రామాల్లో వందశాతం పథకాలు అమలు చేస్తామని చెప్పిందని, ఏ ఒక్క గ్రామంలో కూడా పథకాలు అమలు జరుగలేదన్నారు. ప్రజలను మభ్యపెట్టడానికి గ్రామసభలు, వార్డు సభల పేరుతో కాలయాపన చేసిందని, ప్రజలు ఆ పార్టీని నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

మీర్‌పేట్‌లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో మహాత్మాగాందీ విగ్రహానికి హామీలు అమలు చేయాలంటూ వినతిపత్రాలు అందజేశారు. జిల్లాలోని షాద్‌నగర్, చేవెళ్ల, ఆమనగల్లు, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయసంస్థ జిల్లా మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ కృపేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు భరత్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బుగ్గరాములు, రమేశ్, రమేశ్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్‌గౌడ్, శివసాయి, సురేశ్, మహేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గణేశ్, వీరేశ్, జగదీశ్, రఘుపతి, జానీపాషా, మహేశ్ పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలకు ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఇవ్వబోం

పరీక్షా కేంద్రాలకు ప్రైవేటు జూనియర్ కళాశాలలను ఇవ్వబోమని జిల్లా నోడల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాళ్లు

వికారాబాద్, జనవరి 30 : తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం(టీపీజేఎంఏ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని తమ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఇవ్వడం లేదని టీపీజేఎంఏ జిల్లా కమిటీ సభ్యులు గురువారం జిల్లా నోడల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదని, తమ ఆర్థిక పరిస్థితి బాగా లేదన్నారు. తాము సీసీ కెమెరాలు తదితర ఏర్పాట్లు చేయలేమని, తమ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఇవ్వలేమని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకుంటే ప్రాక్టికల్ పరీక్షా కేంద్రంగా ఇవ్వాలనిని బోర్డ్ సెక్రటరీ ఆదేశించారన్నారు. వారి ఆదేశానుసారమే తమ పరిస్థితుల దృష్ట్యా తమ కళాశాలలను ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు కేంద్రాలుగా ఇవ్వడం లేదని వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఇవ్వకూడదని తమ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందన్నారు. బోర్డ్ సెక్రటరీ ఏకపక్ష నిర్ణయాలతో రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు పలు రకాలుగా ఇబ్బందిపడుతున్నాయన్నారు. నాలుగు దశాబ్దాలుగా వందలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించి, వేలాది మందికి విద్యా సేవ చేసిన తమ కళాశాలలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ పట్టభద్రులు ఏర్పాటు చేసుకున్న బడ్జెట్ కళాశాలలను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ కళాశాలకు రెడ్ కార్పెట్ వేస్తున్న బోర్డ్ సెక్రటరీ, సంబంధిత ఉన్నతాధికారుల నిర్ణయాలను ప్రభుత్వ పెద్దలు సమీక్షించుకోవాలని కోరారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, చిన్న బడ్జెట్ విద్యా సంస్థలను పరిరక్షిస్తూ, కార్పొరేట్ విద్యా సంస్థలను కట్టడి చేసినప్పుడే రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మెరుగుపడుతుందని వారు స్పష్టం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీపీజేఎంఏ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా నాయకులు, సీనియర్ కరస్పాండెంట్‌ల బృందం ఉన్నారు.

కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ సందర్శన

బంట్వారం(కోట్‌పల్లి), జనవరి 30 : కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ నారాయణరెడ్డి గురువారం సందర్శించారు. అక్కడ ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసులకు పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో పోలీసులు నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. ప్రజలకెప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలను అందించాలన్నారు. గ్రామాల్లో తమ పరిధిలో పోలీసులు బీట్ నిర్వహిస్తుండాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూరు సీఐ రఘురాములు, స్థానిక ఎస్ఐ గఫార్ ఉన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులపై కక్షసాధింపేలా..?

సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్

వికారాబాద్, జనవరి 30 : సమగ్ర శిక్షా ఉద్యోగుల పాలిట ప్రభుత్వం కక్షసాధింపు ఎందుకని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్, జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, స్వప్నారెడ్డి గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె విరమించి 25 రోజులు గడిచినా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సమస్యల పరిష్కారంపై ఊసే లేదన్నారు. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. వెంటనే సమ్మె కాలపు జీతాలు చెల్లించాలని, ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 6న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎస్సీడీ ఈ.వీ.ఎన్. నర్సింహారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కలిసి సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం కమిటీ సభ్యులతో చర్చలు జరిపి సానుకూల స్పందనతో పేస్కేల్ గురించి మంత్రివర్గం ఉపసంఘంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారన్నారు. ఆర్థికేతర అంశాలపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని, సమ్మె కాలపు జీతాలు సంక్రాంతి పండుగకు ముందే ఇస్తామని హామీ ఇచ్చి పత్రికా ప్రకటన రూపంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెలువరించడంతో ఉద్యోగులు సమ్మె విరమించారని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శీతల్

లైంగిక వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

సీనియర్ సివిల్ జడ్జి శీతల్

వికారాబాద్, జనవరి 30 : లైంగిక వేధింపులకు గురైన మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ శీతల్ తెలియజేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళా హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలు లైంగిక వేధింపులకు గురైనట్లైతే అంతర్గత, స్థానిక ఫిర్యాదుల కమిటీకి తమ సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని చెప్పారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, సోషల్ మీడియాలో అసభ్య రాతలు, మెస్‌జ్‌లు పెట్టినా, వీడియోలు పెట్టినా లైంగిక వేధింపుల చట్టంలోకి వస్తాయని పేర్కొన్నారు. ఫిర్యాదులు చేసే క్రమంలో సాక్ష్యాలు తప్పనిసరన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, కలెక్టరేట్ ఏవో ఫర్హీన్, లీగల్ ఎయిడ్ బార్ కౌన్సిల్ సభ్యులు, ప్యానెల్ అడ్వకేట్ రాజశేఖర్ ఉన్నారు.

మొక్కల జీవవైవిధ్యాన్ని కాపాడాలి

మహిళా రైతులకు కుట్టు మిషన్‌లు అందజేస్తున్న జాతీయ జన్యు వనరుల కేంద్రం డైరెక్టర్ డాక్టర్ జీపీ సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్తలు

కులకచర్ల, జనవరి 30 : మొక్కల జీవవైవిధ్యాన్ని కాపాడాలని జాతీయ మొక్కల జన్యు వనరుల పరిశోధన డైరెక్టర్ డాక్టర్ జీపీ సింగ్ అన్నారు. గురువారం కులకచర్ల లోని రైతు వేదికలో జాతీయ మొక్కల జన్యు వనరుల పరిశోధనా కేంద్రం షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన వ్యవసాయ పద్ధతులతో పాత వంగడాలను ఏవిధంగా సంరక్షించుకోవాలో తెలియజేశారు. పాత పంటలను సాగుచేసి సంరక్షించే రైతులకు కేంద్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా కులకచర్ల గ్రామానికి చెందిన రైతులకు ఒక్కొక్కరికి వ్యవసాయ పరికరాలైన మందు పిచికారీ పంపు, టార్పాలిన్, క్రేట్‌లు, మహిళా రైతులకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్‌కే కౌశిక్, శరవణన్, అనిత, ప్రసన్న, పరమేశ్వరి, ఎంవీ రెడ్డి, ఆసరా ఎన్‌జీవో చైర్మన్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్య ఫలాలు

జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, జనవరి 30 : మహనీయుల త్యాగ ఫలితమే మనం పొందుతున్న స్వాతంత్ర్య ఫలాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం, మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో వివిధ శాఖల సిబ్బందితో కలిసి అదనపు కలెక్టర్ రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య సాధనకు తమ ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవాలన్నారు. 200 సంవత్సరాలు ఆంగ్లేయులు మన దేశాన్ని పాలించిన క్రమంలో సాయుధ పోరాటంతోపాటు శాంతియుత పోరాటాన్ని జరిపి స్వాతంత్ర్యాన్ని పొందామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు, మొదటి తుపాకి పట్టిన పాండే, కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య లాంటి వారు తమ ప్రాణాలు సైతం అర్పించారని అదనపు కలెక్టర్ గుర్తు చేశారు. నల్లజాతుల ప్రజల హక్కుల కోసం శాంతియుత పోరాటం చేసిన నెల్సన్ మండేలాను గుర్తు చేసుకోవాల్సిన అవసరముందని ఆయన సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి మల్లేశం, ఏవో ఫర్హీన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గాంధీజీ వర్ధంతి సందర్భంగా మౌనం పాటిస్తున్న ఉద్యోగులు

సమావేశానికి హాజరైన మహిళా ఉద్యోగులు

నేడు సీఎం రాక

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్, జనవరి 30 : ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటై 152 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. సీఎం రాక నేపథ్యంలో కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం కార్యక్రమానికి విచ్చేసే నాయకులు, అధికారులు, ప్రజలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అక్లేకర్

కేరళ గవర్నర్‌కు ఘన స్వాగతం

కొడంగల్, జనవరి 30 : కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అక్లేకర్ కొడంగల్‌కు వచ్చేసిన సందర్భంగా అధికారులు ఘన స్వాగతం పలికారు. గురువారం కొడంగల్ మీదుగా కర్ణాటకలోని సేడంకు వెళ్లే క్రమంలో ఆయన స్థానిక కడా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని అందుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ గవర్నర్‌కు మొక్కను అందించి స్వాగతం పలికారు. కడా కార్యాలయంలో కలెక్టర్‌తో ముచ్చటించి అల్పాహారాన్ని స్వీకరించారు. అనంతరం కొంత సమయం సేదతీరి సేడంకు బయలుదేరారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం ప్రధాన కార్యాలయం పరిశీలన

తుర్కయాంజాల్, జనవరి 30 : ఎన్ఐఆర్‌డీ(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) శిక్షణలో భాగంగా ఒడిశా రాష్ట్రం రైడ జిల్లాకు చెందిన సుమారు 30 మంది రైతు సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు గురువారం తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల కోసం చేస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్ సత్తయ్యను వారు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి రంగారెడ్డి జిల్లా మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ సంజీవరెడ్డి, సీఈవో రాందాస్ పాల్గొన్నారు.


డీసీసీబీ చైర్మన్ సత్తయ్యతో ఒడిశా రాష్ట్ర సహకార సంఘాల అధ్యక్షులు తదితరులు

అధికారులతో మాట్లాడుతున్న ప్రఖ్యాత వక్త వాస్కో గ్యాస్పర్

డీప్ యూ ఇండియా రిట్రీట్ వర్క్‌షాప్

నందిగామ, జనవరి 30 : నందిగామ మండలం కన్హా శాంతి వనంలో గత నాలుగు రోజులుగా డీప్ యూ ఇండియా రిట్రీట్ వర్క్‌షాప్ కార్యక్రమం కాన్షియస్ లీడర్‌షిప్, హ్యూమన్ ఫ్లరిషింగ్ ప్రఖ్యాత వక్త వాస్కో గ్యాస్పర్ ఆధ్వర్యంలో 40 మందికి పైగా ఐపీఎస్ అధికారులు ఇతర అధికారులతో నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను సానుకూల మార్గాల్లో నడిపించడం, సమతుల్య జీవితాలను గడపడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కన్హా శాంతి వనంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో వర్క్ షాపు నిర్వహించడం సంతోషంగా ఉందని దాజీకి కృతజ్ఞతలు తెలిపారు.